ప్రజాశక్తి

గురువారం 21 మార్చి 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా







చెక్ పోస్టులను తనిఖీ చేసిన నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా

చెక్‌పోస్టుల వద్ద సిపి తనిఖీ

అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు

ప్రజాశక్తి - విజయవాడ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులను బుధవారం ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా పరిశీలించారు. ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల సరిహద్దున ఉన్న ప్రకాశం బ్యారేజ్ చెక్‌పోస్ట్‌ను, గుంటుపల్లి చెక్‌పోస్ట్‌ను పరిశీలించి స్వయంగా వాహనాలను తనిఖీ చేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద వాహనాల రాకపోకలను, తనిఖీలను కొద్దిసేపు గమనించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అక్రమంగా నగదు, మద్యం, నాటు సారా, గంజాయి రవాణాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది 24/7 తరహాలో నిరంతరం వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. నగదు, మద్యం వంటివి పట్టుబడితే తక్షణమే అధికారులకు సమాచారం అందించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అనంతరం ఇబ్రహీంపట్నం ఎ కాలనీలో సెంట్రల్ బలగాలకు ఏర్పాటు చేసిన వసతిని పరిశీలించి వారి అవసరాలను తెలుసుకున్నారు. వారికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిసిపి అధిరాజ్ సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు ఉపాధ్యాయులు

● పరిశీలన ప్రక్రియ పూర్తి ● త్వరలో డిస్పాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి


ఎన్నికలకు ఉపాధ్యాయుల వినియోగానికి సంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఉపాధ్యాయులు ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు. ఎవరిని విధులకు తీసుకోవాలనేది ఇప్పటికే నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల విధులకు హాజరు కావాలనే ఉత్వర్వులను త్వరలో ఉపాధ్యాయులకు అందనున్నాయి. అంతేగాక డిస్పాచ్ ప్రక్రియను కూడా ప్రారంభించను న్నారు. నేరుగా అవి జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయాలకు వెళ్లవు. వ్యక్తిగత చిరునామా లకు కాకుండా వారు పని చేస్తున్న కార్యాలయా లకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 5244 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఎన్ని వివరాలను స్క్రూటినీ చేశారు, ఎంత మందిని ఫిల్టర్ చేశారు, ఎంత మందికి ఎన్నికల విధులకు మినహాయింపు ఇచ్చారనేది తెలియాల్సి ఉంది. అయితే ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కావాలని భారీగానే అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు సమాచారం. జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం నుంచి 5244 మంది ఉపాధ్యాయుల వివరాలను ఎన్నికల అధికారికి అందించారు. స్క్రూటినీ కూడా తుది దశకు చేరుకున్నట్లు తెలిసింది. వీరందరి ధృవీకరణ ప్రక్రియ పూర్తయింది. అలాగా స్క్రూటినీ కూడా పూర్తయితే ఎంత మందిని ఎన్నికల విధుల్లోకి తీసుకుంటారు, ఎంత మందిని తీసుకోరనేది స్పష్టత రానుంది. 2024 ఎన్నికల్లో ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోవాలని సిఇఒ నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులుగా ఉపాధ్యాయులను నియమించనున్నారు. ఆ మేరకు జిల్లాలోని ఉపాధ్యాయుల వివరాలను పంపాలని జిల్లా కలెక్టర్‌కు జనవరిలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగం వివరాలను సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో 948 ప్రభుత్వ పాఠశాలలు న్నాయి. వీటిలో రెగ్యులర్, కాంట్రాక్ట్, గురు కులాలు, ఎయిడెడ్, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎంపిపి ఇలా అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 5244 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరి వివరాలన్నింటినీ ఎన్నికల సంఘానికి నివేదించారు. దాదాపు అందరి ఉపాధ్యాయుల వివరాలన సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. వారి ఓటర్ గుర్తింపు కార్డుతోపాటు బ్యాంకు అకౌంట్ డీటెయిల్స్ ఆధారంగా వివరాల ధృవీకరణ చేపట్టారు. తీవ్రమైన అనారోగ్యం వంటి సమస్యలు ఉన్న వారు తప్ప దాదాపు ఉపాధ్యాయులందరికీ ఎన్నికల విధులు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతు న్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఆదేశాలు అందరికీ అందించిన తర్వాత ఎన్నికల విధుల నిర్వహణపై రెండు దఫాలుగా శిక్షణ ఇస్తారు.

ఎన్ఆర్ఐ అభ్యర్థుల హవా

కోడ్‌రాక ముందే భారీగా ఖర్చు రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన నియోజకవర్గాలుగా గుడివాడ, గన్నవరం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గుడివాడ, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అధిష్టానం ఎన్ఆర్ఐ అభ్యర్థులను రంగంలోకి దించింది. వైసిపి గుడివాడ అభ్యర్థి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)పై వెనిగండ్ల రామును, గన్నవరంలో వల్లభనేని వంశీమోహన్‌పై యార్లగడ్డ వెంకట్రావును పోటీకి పెట్టింది. ఈరెండు నియోజకవర్గాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే అభ్యర్థులు పోటాపోటీగా డబ్బులు ఖర్చు పెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రంలోనే అత్యంత ఖరీదైన అసెంబ్లీ నియోజకవర్గాలుగా ఉంటాయనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.



పార్టీ ఆశయాలకు కట్టుబడి, సేవా భావంతో పనిచేసే వారిని ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులుగా ప్రకటించే రోజులు పోయాయి. ముఖ్యంగా టిడిపి, వైసిపిలు ఎంత ఎక్కువగా ఖర్చు చేయగలరని ఆలోచించి తమ అభ్యర్థులను ప్రకటించే రోజులు వచ్చాయి. ఈ క్రమంలోనే కృష్ణాజిల్లాలోని గన్నవరం, గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాలు అత్యంత ఖరీదైనవిగా మారిపోయాయని రాజకీయవర్గాలు చెబుతాయి. గత ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లోనూ ఒక్కో ఓటుకు సగటున రూ.2 వేలకుపైగా ఖర్చు పెట్టారనే వార్తలు వచ్చాయి. ఈక్రమంలోనే 2024 ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి గన్నవరం, గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్ఆర్ఐ అభ్యర్థులను రంగంలో దించడం ప్రాధాన్యత సంతరించుకుంది. టిడిపి గన్నవరం అభ్యర్థిగా పోటీ చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో వల్లభనేని వంశీ చేతిలో ఓటమి పాలయ్యారు. ఇక్కడే టిడిపి అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన వల్లభనేని వంశీ వైసిపిలో చేరారు. దీంతో వచ్చే ఎన్నికల్లో యార్లగడ్డకు వైసిపి అధిష్టానం సీటు కేటాయించలేదు. ఈనేపథ్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కృష్ణాజిల్లాలో సాగిన సమయంలో యార్లగడ్డ ఆ పార్టీలో చేరారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా గన్నవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భారీగా ఖర్చు చేశారు. ఆతర్వాత కొద్ది రోజులకే ఆయనకు టిడిపి అధిష్టానం గన్నవరం టికెట్ కేటాయించింది. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో యార్లగడ్డ పర్యటించి అనారోగ్యానికి గురైన వారికి, ఎవరైనా చనిపోయి కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా సాయం అందిస్తూ ప్రచారం సాగించారు. అలాగే గుడివాడలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొన్న "రా...కదిలి రా...' బహిరంగ సభను జయప్రదం చేయడానికి వెనిగండ్ల రాము భారీగానే ఖర్చు పెట్టారు. నియోజకవర్గంలో ప్రజల తాగునీటి అవసరాలకు ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేశారు. గుడివాడలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు ప్రతి రోజూ ఉచితంగా భోజనం అందించారు. వివిధ ప్రార్థనా మందిరాలకు ఆర్థికంగా సాయం చేశారు.

వైసిపి అభ్యర్థులకూ భారీగానే ఖర్చు

గన్నవరం, గుడవాడ నియోజకవర్గాల్లోని టిడిపి ఎన్ఆర్ఐ అభ్యర్థులతో పోటీగా బరిలో నిలిచిన అధికార వైసిపి అభ్యర్థులు వల్లభనేని వంశీమోహన్, కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) సైతం ఖర్చుకు వెనుకాడకుండా కోడ్‌కు ముందే భారీగా ఖర్చు పెట్టారనే ప్రచారం జరుగుతోంది. టిడిపి అభ్యర్థుల నుండి పోటీని తట్టుకుని నిలబడేందుకు ఎక్కువ మొత్తంలోనే ఖర్చు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల సమగ్ర సమాచారం కోసం

మీడియా సెంటర్ ఏర్పాటు

ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : సాధారణ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలకు అందజేసి ప్రజలకు తెలియజేసేలా మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మీడియా సెంటర్ ఏర్పాటుకు బుధవారం ఆయన నగరంలోని ప్రభుత్వ అతిథి గహం ఆవరణలో గల డిఐపిఆర్ఒ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా డిల్లీరావు మాట్లాడుతూ ఇసిఐ సూచనల మేరకు ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాల్సిన అవసరముందన్నారు. మీడియా సెంటర్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు సకాలంలో అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గాలకు నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గాల మ్యాప్‌లు, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎన్నికల అధికారుల వివరాలను ప్రత్యేక బోర్డుల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమల్లో ఉన్నందున ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా రూపొందించిన నివేదికల సమాచారాన్ని మీడియా సెంటర్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాల మార్గదర్శకాల మేరకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ వి.శ్రీనివాసరావు, డిఐపిఆర్ఒ యు.సురేంద్రనాథ్, డిపిఆర్ఒ ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పిఆర్ఒ కె.రవి, ప్రచార సహాయకులు వీవీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెంటరు ఏర్పాటును పరిశీలిస్తున్న కలెక్టర్ డిల్లీరావు



రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : గురువారం సాయంత్రం 6.32
సహర్ : శుక్రవారం ఉదయం 4.57



విద్యార్థులను అభినందిస్తున్న ఎల్‌బిఆర్‌సిఇ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్, తదితరులు

ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : కెఎల్ యూనివర్సిటీ వారు ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన స్టేట్ లెవెల్ అవిష్కర్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ కాంపిటీషన్‌లో మైలవరం ఎల్‌బిఆర్‌సిఇ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు బహుమతులను అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు బుధవారం తెలిపారు. సిఎస్‌సి నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి యు.అర్జున్ తృతీయ బహుమతి, సిఎస్‌ఇ విభాగం నుండి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జి.శ్రీనివాస్ రెడ్డి, పి.సాయిరాం కన్సొలేషన్ బహుమతులు పొందారన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ రెడ్డి, సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ డి.వీరయ్య, కోఆర్డినేటర్లు విద్యార్థులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి - మైలవరం : ఎల్‌బిఆర్‌సిఇ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కనిమేర్ల తండాలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో 95 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మైలవరం ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రమ్య వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోగనిరోధక శక్తిని పెంపొందించుకుంటే ఎలాంటి వ్యాధులు రావు అన్నారు. భోజనానికి ముందు ఇతర పదార్థాలు తినే సమయంలో కాళ్ల చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పౌష్టికరమైన ఆహారం తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఎల్‌బిఆర్‌సిఇ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలని కాచి చల్లార్చిన నీరుని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.శివ హరిప్రసాద్, ఎస్.ఉమామహేశ్వర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - వీరులపాడు : తెలంగాణ, ఆంధ్రరాష్ట్ర, బోర్డర్, అయిన వీరులపాడు మండల పెద్దాపురం చెక్‌పోస్ట్ వద్ద నందిగామ రూరల్ సిఐ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. నందిగామ ఎసిపి రవికిరణ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి వాహనాన్ని వదలకుండా తనిఖీలు చేశారు. వీరులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అవాంచిత సంఘటన జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. వాహనాలను విస్తతంగా తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయకుండా వదలొద్దని పోలీస్ సిబ్బందికి ఆయన ఆదేశాలిచ్చారు. ఎలాంటి అనుమానాలు వచ్చినా ముందుగా ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. పార్టీ నాయకులు వాహనాలను కూడా వదలకుండా విధిగా చెక్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరుల పాడు ఎస్ఐ మహాలక్ష్ముడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కాలుష్య నియంత్రణకు చర్యలు

ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం లిఖితపూర్వక హామీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కాలుష్య నియంత్రణ సమితి పోరాటానికి ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం దిగివచ్చింది. సోమవారం యాజమాన్యంతో జరిగిన సమావేశంలో పోరాట సమితి సభ్యులు ఇచ్చిన 20 కాలుష్య నివారణ డిమాండ్లపై స్పందిస్తూ, ముందుగా 3 డిమాండ్లపై తక్షణమే చర్యలు తీసుకుంటామని పోరాట సమితి సభ్యులకు లిఖితపూర్వక హామీ ఇచ్చింది. ప్రజలకు ఇబ్బందిగా మారిన బూడిద రవాణాపై దృష్టి సారిస్తున్నామని, బూడిద రవాణాపై పోరాట సమితి సభ్యులు సూచించిన డిమాండ్లను అమలు చేస్తామని తెలిపారు. మిగిలిన డిమాండ్లపై కూడా ఉన్నత అధికారులు చర్చించి త్వరలో రాతపూర్వక హామీ ఇస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొండపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోరాట సమితి అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్ స్పందించే యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, 40 ఏళు ్గా డాక్టర్ ఎన్‌టిటిఎస్ కాలుష్యం భూతానికి విలవిలలాడుతున్న 12 గ్రామాల పోరాటంపై యాజమాన్యం స్పందించి లిఖిత పూర్వక హామీ ఇవ్వడం కాలుష్య నియంత్రణ పోరాట సమితి సభ్యులు, ప్రజలు హర్షించదగ్గ విషయమన్నారు. సిఎస్‌ఆర్ ఫండింగ్ సుమారు 30 కోట్ల బకాయిలను త్వరగా విడుదల చేయాలని, వాటి ద్వారా



హామీ పత్రాన్ని చూపుతున్న పోరాట సమితి సభ్యులు

గ్రామాభివృద్ధి సాధించుకోవచ్చని తెలిపారు.ఎన్‌టిటిపిఎస్ బూడిద అమ్మిన డబ్బులు ఏ అధికారి జేబుల్లోకి వెళ్తున్నాయో యాజమాన్యం సమాధానం చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా మౌనం వహించడం ఇక్కడి ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందిస్తే కేవలం 3 డిమాండ్లపై మాత్రమే స్పందించడం నిరాశ కలిగించిందన్నారు. పూర్తి డిమాండ్ల సాధనకై త్వరలోనే ఉన్నతాధికారుల సమక్షంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఎన్నికల నిధులు ఆయా అధికారులు ఎటువంటి రాజకీయ ఇబ్బందులు ఎదుర్కోకుండా విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించడంలో మండల స్థాయి అధికారులు గ్రామాల్లో గ్రామస్థాయి టీమ్‌లుగా ఏర్పడి ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీ కార్యాలయాలు రాజకీయ పార్టీ రంగులు ఉన్న వాటిని కూడా తొలగించే పనిలో ఉన్నారు. జిల్లాస్థాయి అధికారుల అనుమతులు తీసుకున్న తర్వాతే రాజకీయ పార్టీల ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లు వాటి కావాల్సిన సౌకర్యాలు అన్ని వసతులు అధికారులు చక్క దిద్దుతున్నారు. చౌటపల్లి గ్రామంలో ప్రభుత్వ భవనానికి రాజకీయ పార్టీలు రంగులు ఉండటంతో తొలగించే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. సకాలంలో పోలీసు చౌటపల్లి గ్రామానికి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులకు ఇబ్బందులు గురి చేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో నిబంధనలకు అనుగుణంగా వివిధ రాజకీయ పార్టీల జెండా పెక్సీలు తొలగించడం సర్వసాధారణం కార్మిక సంఘ నాయకులు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న జెండాలను తోరణాలను తొలగించడం పట్ల వివిధ కార్మిక సంఘ నాయకులు అధికారులపై మండిపడుతున్నారు. ప్రజా సంఘాలు ఎన్నికల్లో పాల్గొనట్లేదు ఎన్నికల గుర్తు కూడా లేనందువల్ల వాటిని తొలగించడం సరైన పద్ధతి కాదని ఎన్నికల నిబంధనకు లోబడి అధికారులు పనిచేయాలని కార్మిక సంఘ నాయకులు ప్రభుత్వ ఎన్నికల అధికారులను కోరుతున్నారు.

బూత్ కమిటీ సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణం 4వ వార్డులో స్థానిక ప్రజలతో, పార్టీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా మొండితోక జగన్ మోహన్‌రావు ఈ 5 ఏళ్ళలో చేసి చూపించారన్నారు. నందిగామ రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. పట్టణంలో ప్రధాన రోడ్ల విస్తీర్ణతతో సెంట్రల్ లైటింగ్ డివైడర్ల ఏర్పాటుతో పట్టణం స్వరూపం మారిపోయి మరింత అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు దొంతి రెడ్డి దేవేందర్ రెడ్డి, మురళి, చల్లా బ్రహ్మం, రాంబాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి అరుణ్‌కుమార్



టిడిపి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గంపలగూడెం : టిడిపి అధినేత చంద్రబాబు తో ఈ రాష్ట్రానికి భవిష్యత్తు అని మేడూరు గ్రామ టిడిపి నాయకులు గల్లా సంగయ్య పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గ్రామంలో కార్యకర్తలతో కలిసి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందజేస్తూ, బాబుకు ఓటేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఎన్టీఆర్ కాలనీలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీలైన 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1800, మూడు గ్యాస్ బండలు, రూ.4వేలు పెన్షన్, ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు విద్యా దీవెన, తదితర పథకాలు ప్రతి ఇంటికి చేరుతాయన్నారు. టౌన్ పార్టీ అధ్యక్షులు కాజా రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఎన్టీఆర్ జిల్లా (ఎస్‌బి) ఎడిసిపి పార్థసారథి బుధవారం నెమలి సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు ఆలయ కార్య నిర్వహణ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ ఎన్ వి సాంబశివరావు, చైర్మన్ కావూరి శశిరేఖలు ఉన్నారు. ముందుగా స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదం అందుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న అధికారులు



తాగునీరు, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద సత్యసాయి సేవా సమితి సభ్యులు మంగళవారం మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. విద్యార్థులు మూడు గంటలు కష్టపడి పరీక్ష రాసి బయకు వచ్చిన విద్యార్థులు ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురికాకుండా ఉండేందుకు మజ్జిగ పానీయం పంపిణీ చేస్తున్నట్లు సేవా సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు, సభ్యులు తెలిపారు.

వార్డు ఇన్చార్జిగా కొండలరావు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ వైసిపి 13వ వార్డు ఇన్‌ఛార్జ్‌గా నల్లని కొండలరావు, 4వ వార్డు ఇన్‌ఛార్జ్‌గా మువ్వల శ్రీనివాసరావు బుధవారం నియమితులయ్యారు. నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 4, 13 వ వార్డుల పార్టీ ఇన్ ఛార్జ్ లుగా మువ్వల శ్రీనివాసరావు, నల్లాని కొండలరావులను నియమిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షులు దొంతి రెడ్డి దేవేందర్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు.

ఎంఎల్‌సిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ వైసిపి కార్యాలయంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌ను జిల్లా ఎస్‌సి సెల్ సెక్రటరీగా నియమితులైన దొంతిమాల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బొల్లా మేరీ కుమారి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్సీని శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

గోదా కృష్ణమూర్తి కల్యాణం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 71 శ్రీరామ కోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజు బుధవారం ఆలయ ఇఒ వాసిరెడ్డి భూపాల్, సీతారామ నామ సంకీర్తన సంఘం అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పారేపల్లి సాయిబాబు, దుడ్డు నాగేశ్వరరావు, పులిపాటి శ్రీనివాసరావు సంఘ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు దివి రత్నమాచార్యులు, ఆలయాన్ని పూలతో అలంకరించారు. కళ్యాణ వేదికపై గోదా శ్రీకష్ణమూర్తి దివ్య కళ్యాణం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తిరునాళ్లపై సమావేశం

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి గ్రామంలో వత్సవాయమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా దేవస్థానంలో పలు శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ తిరునాళ్లలో తీసుకోవాల్సిన అన్ని రకాల జాగ్రత్తలు, యాత్రికుల సౌకర్యాలు, ఎమ్మార్వో సూర్యారావు ఎస్ఐ అభిమన్య, ఎలక్ట్రికల్ ఎఇ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఈ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం దేవస్థాన కార్య నిర్వాహణాధికారి వై.శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రచార ప్రకటనలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి ప్రసార మాధ్యమాల్లో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు గానీ వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందుట కోసం నిర్ణీత నమూనాలో ప్రకటన ప్రసారం చేయుటకు 3 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేయుటకు 7 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు పోలింగ్ ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుండి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్ లు, డిజిటల్ డిస్ప్లే లు, మొబైల్ నెట్వర్క్ ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్ లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఇన్స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్సైట్లు, వికీపీడియా కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు. అలాగే సినిమా హాళ్లలోనూ, ప్రైవేట్ ఎఫ్ఎం రేడియోలలో, ఎలక్ట్రానిక్ పత్రికలలోను, ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. అనుమతి పొందిన ఆర్డర్ నంబర్ను సంబంధిత ప్రకటనపై సూచించాల్సి ఉంటుందన్నారు ఈ విషయాన్ని అన్ని ప్రసారమాధ్యమాలు గమనించాలని సూచించారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలుగా పరిగణించి, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని వెలువోలుకు చెందిన ఆటో డ్రైవర్ పడమటి అమరేశ్వరరావు తండ్రి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం శ్రీ సిద్ధి వినాయక ఆటో యూనియన్కు వాటర్ కూలర్ బహూకరించారు. ఈ క్రమంలో స్థానిక నడకుదురు పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐటియు సీనియర్ నాయకులు వెనిగళ్ల వసంతరావు, మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహం తీర్చేందుకు వాటర్ కూలర్ అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి సోమవారం ఆటో యూనియన్ సహకారంతో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోట అంజయ్య, ఓలేటి విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. బాపులపాడు మండలం ఎస్.ఎన్.పాలెం పంచాయితీ పరిధిలోని జాతీయ రహదారిపై హెచ్పీ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం ఉదయం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఏలూరు నుండి విజయవాడ వైపుకు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి అచూకీ కోసం చుట్టుప్రక్కల దర్యాప్తు చేసిన ఫలితం లేకపోవడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

24 నుంచి నాంచారమ్మ జాతర

ప్రజాశక్తి-కోడూరు: విశ్వనాథపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో బుధవారం సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే అమ్మవారి జాతరకు గుంటూరు, కృష్ణాజిల్లా నుంచి యాత్రికులు భారీగా తరలివస్తారన్నారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ త్రినాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ నాయకులు ఎవరు పార్టీ సింబల్స్తో కూడిన జెండాలను కానీ, ఫ్లెక్సీ బ్యానర్లు గాని ఏర్పాటు చేయకూడదని, ఎవరైనా అతిక్రమించి ఏర్పాటు చేస్తే వారిపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనల ప్రకారం కేసుల నమోదు చేస్తామని తెలిపారు.

మధురానగర్లో తాగునీటి సమస్య

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ: మధురానగర్లో తీవ్ర మంచినీటి సమస్య నెలకొంది. నగర పాలక సంస్థ సరఫరా చేస్తున్న కొద్దిపాటి నీరు కూడా మురికిగా వస్తోంది. నీటి మీటర్ల ఏర్పాటు కోసం అమర్చిన అరంగులం పైపు వల్ల నీళ్లు సరిగ్గా రావడంలేదు. వచ్చిన నీరు కూడా మురికిగా వస్తోంది. దీంతో ప్రజలు తమకు పాత పద్ధతిలోనే పాత పైపుల ద్వారా జరిగే నీటినే సరఫరా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తూ బిందెలతో నిరసన తెలిపారు. మధురానగర్ కొబ్బరి తోటలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పాత పద్ధతిలో నీటి సరఫరాను కొనసాగించికపోతే నగరవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని పౌర సంక్షేమ సంఘం నాయకులు కృష్ణమూర్తి హెచ్చరించారు. అమత్ 24/7 పథకంలో భాగంగా పసుపు తోటలో ద్వారా నీటి మీటర్లు ఏర్పాటు చేశారు. సిపిఎం, పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నగరంలో


ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పలుచోట్ల ఎక్కడికక్కడ స్థానికులు ఆందోళనలు నిర్వహించారని, దీంతో నగర పాలక సంస్థ అధికారులు కొన్నిచోట్ల నీటి మీటర్లను తొలగించారని కృష్ణమూర్తి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో షమీమా బేగం, యాస్మిన్, సుమ, కీర్తి, ఎ.రాజేశ్వరి, షాహిద, శైలజ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డిసిపి


ప్రజాశక్తి-విజయవాడ : డిసిపి అధిరాజ్ సింగ్ రాణా బుధవారం పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కృష్ణలంక పోలీస్స్టేషన్ పరిధిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో



తనిఖీ నిర్వహించారు. పోలీస్ అధికారులకు, పరీక్షా కేంద్రాల అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు.

నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మండలం బిల్లపాడు గ్రామంలో రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్సర్క్యూట్ వల్ల అక్కడ నివసిస్తున్న పడమట కనకదుర్గ ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో గుడివాడ పట్టణ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు నిత్యావసర వస్తువులను అందజేశారు. బుధవారం ఇండియన్ రెడ్క్రాస్ సభ్యులు



బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి బావిరి శంకర్ నాథ్ మాట్లాడుతూ చాలామంది రెడ్ క్రాస్ అంటే రక్తదానం చేయడమే అనుకుంటారన్నారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమ సొసైటీ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మడక ప్రసాద్, ట్రెజరీ అనురాధ, పావని, సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు అర్జునుడు

ప్రథమ వర్థంతిలో కొల్లు, కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): క్రమశిక్షణకు బచ్చుల అర్జునుడు మారుపేరని టిడిపి పొలిట్బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షుడు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జునుడు చిత్ర పటానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీనవర్గాల నుంచి విద్యార్థి నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చిన బచ్చుల అర్జునుడు జిల్లా సహకార బ్యాంక్ ఉపాధ్యక్షునిగా, బందరు మున్సిపల్ చైర్మన్గా, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షునిగా విశేష సేవలు అందించారన్నారు. జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లో మచ్చలేని జీవితాన్ని గడిపిన బచ్చుల అర్జునుడు ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారులు రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహణ కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం, బచ్చుల నాగబాబు, కృష్ణా మిల్క్ డైయిరి చైర్మన్ చలసాని ఆంజనేయులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర నేత ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, టీడీపీ నగర అధ్యక్షులు ఇలియాస్ పాషా , టీడీపీ రూరల్ అధ్యక్షులు కుంచె నాని తదితరులు పాల్గొన్నారు.

కాకాని బాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-హనుమాన్జంక్షన్: శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ, కాకాని ఫౌండేషన్ చైర్మన్ కాకాని బాబు జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, కొఠారు అబ్బయ్య చౌదరీ, దెందులూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పన ప్రసాద్, జనసేన గన్నవరం నియోజకవర్గం సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు, మూల్పూరి సాయి కళ్యాణి, నక్కా గాంధీ తదితరులు కాకానికి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి టౌన్ అధ్యక్షుడు లయన్ అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కరించారు. వ్యాపారవేత్త పప్పు నవీన్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు 30 కిలోల కేక్ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నానో టెక్నాలజీదే భవిష్యత్తు

మెటీరియల్ సైన్స్ వర్క్షాపులో వక్తలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో నానో టెక్నాలజీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలోని భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, ఎమర్జింగ్ ట్రెండ్స్పై సైన్స్ అకాడెమీస్ రెండు రోజుల లెక్చర్ వర్క్షాప్ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బిఎల్వి ప్రసాద్ కన్వీనర్గా వ్యవహరించి మాట్లాడుతూ, నానో పార్టికల్స్ను అభివద్ధి చేయడం ద్వారా పరిమాణం, భౌతిక రసాయన లక్షణాలను తగ్గించడమని, ఈ కణాలను ఉపయోగించడం ద్వారా వినూత్నమైన అనువర్తనాలను ఎలా తయారు చేయవచ్చో వివరించారు. హైదరాబాద్లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ టాటా నరసింగరావు మాట్లాడుతూ, ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం సాంకేతికతను మార్కెట్కు ఎలా బదిలీ చేస్తుందో వివరించారు. వక్తలు ప్రొఫెసర్ సిహెచ్ సహజ కిరణజన్య, శాస్త్రవేత్త ఎస్.గోపీనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కష్ణ మాట్లాడుతూ, భారతదేశానికి నానో టెక్నాలజీ ఆవశ్యకతను


మాట్లాడుతున్న ప్రసాద్

వివరించారు. భవిష్యత్తు అంతా నానో టెక్నాలజీపైనే ఆధారపడాల్సి ఉంటుందన్నారు. తొలి రోజు జరిగిన వర్క్షాప్లో 15 కళాశాలల నుండి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎన్.రాజశేఖర్, డాక్టర్ ముస్వారీన్, జె.పాండురంగారావు, ఎస్.విజయ్కృష్ణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మనోరంజని, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ పిటిఎస్ఆర్కే ప్రసాదరావు, విశాలాక్షి, నాగార్జున బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్జంక్షన్: బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని షిరిడిసాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం 21వ తేదీ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుండే అభిషేక, అష్టోత్తర సహస్ర పుష్పార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యాత్రికులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్ పేర్కొన్నారు.

బాలుడు అదృశ్యం



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ శ్రీ విద్య స్కూల్ రోడ్‌కి చెందిన తుమ్మల శ్రీరామ్(14) అదశ్యమయ్యారు. శ్రీరామ్ 19న ఉదయం 10 గంటలకు ఇంట్లో గొడవ పడి సైకిల్ వేస్కుని వెళ్లాడు. బుధవారం వరకు ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు బంధువులు నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీరామ్ ఆచూకి తెలిసిన వారు నందిగామ ఎసిపి 9440796409, సిఐ 8332983808, ఎస్ఐ 9440796456, ఎస్ఐ- 2- 9440796457 నెంబర్లకు పోన్ చేసి సమాచారమివ్వాలని నందిగామ సిఐ హనీష్ బుధవారం విలేకరులకు తెలిపారు.



మహేష్‌కు సీటు కేటాయించాలని నిరసన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ సీటును జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్‌కు కేటాయించాలని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఉదయం తొలుత చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగి పిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు (పిసి), నగరాల సామాజిక వర్గ ప్రముఖులు అమ్మవారి దేవస్థానం ముంగిట కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహేష్‌కు పశ్చిమ టికెట్ ఇస్తే ఆయన సునాయాసంగా విజయం సాధించగలరని చెప్పారు. ఈ విషయమై జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా నాయకులైన పోతిన మహేష్ ఎమ్మెల్యే కావాలని నియోజకవర్గంలోని ప్రజలు ఎదురుచూస్తున్నారని వారు అన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్ర పటానికి పాలాభిషేకం

మహేష్‌కు సీటు కేటాయించాలని 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం పాలాభిషేకం నిర్వహించారు. భవానీపురంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గంలో ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ప్రకటించాలని పవన్ కళ్యాణ్‌ని వేడుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో జగ్గయ్యపేట గ్రూప్ దేవస్థానం, కార్యనిర్వహణాధికారి సి.జయప్రకాష్ బాబు పర్యవేక్షణలో, దేవస్థాన కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలత దేవి సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. 125 రోజులకు గానూ దేవాలయంలో 9 హుండీల ద్వారా రూ.16,34,423/- అన్నదాన సత్రం హుండీ -1 ద్వారా రూ.43,597, మొత్తం రూ.16,78,020 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త తరుపున ఏసిపి సంస్థల ప్రతినిధి రామ్ ప్రసాద్, దేవస్థాన సిబ్బంది, ఇతర సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వత్సవాయి - మండలం : వ్యక్తి కాలు మీద లారీ టైర్ ఎక్కడంతో తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం మండలంలోని గట్టు భీమవరం టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పెద్దవరం గ్రామానికి చెందిన ఎస్‌కె నాగుల్‌మీరా చిల్లకల్లు వైపు నుండి నందిగామ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. పొరపాటున బైక్ పై నుండి రోడ్డుపై పడటంతో వెనుకగా వస్తున్న లారీ వెనుక టైరు ఆ వ్యక్తి కాలి నుండి వెళ్లిపోయింది. దీంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. విషయం తెలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. వత్సవాయి ఎస్ఐ అభిమన్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా ఆదేశాల మేరకు వెస్ట్ జోన్ ఎసిపి మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో భవానీపురం సిఐ కృష్ణ పర్యవేక్షణలో భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు వచ్చే విద్యార్థుల వద్ద ఏమైనా సెల్‌ఫోన్‌లు ఉన్నాయా లేవా లేక వాచీలు (చేతి గడియారం) ఉన్నాయా లేవా అని వారిని తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు సకాలంలో హాజరవ్వాలని ఆయన కోరారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు



సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భవానీపురం సిఐ కృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల కేంద్రమైన గంపలగూడెం గాంధీ సెంటర్లో డ్రైనేజీ సమస్య ఏర్పడి వారాల కొద్దీ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డ విషయం తెలిసిందే. ఈ విషయమై డ్రైనేజీ పునర్నిర్మాణానికి స్థానికులే సమస్య అని ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి అధికారులు, పాలకులు స్పందించారు. వెంటనే బుధవారం డ్రైనేజీ పునర్నిర్మాణానికి



కాంక్రీట్ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. మరో ఒకటి రెండు రోజుల్లో ఈ సమస్యకు తెరపడనుంది.

పలుచోట్ల పోలీసుల కవాతు



కంచికచర్ల

ప్రజాశక్తి - కంచికచర్ల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిపి క్రాంతి రాణా టాటా, ఎసిపి రవికిరణ్ ఆదేశానుసారం నందిగామ రూరల్ సిఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాయిధ బలగాలతో మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ బుధవారం సాయంత్రం నిర్వహించారు. కంచికచర్ల మండలం గండేపల్లి, కీసర, పెండ్యాల గ్రామాల్లో రూరల్ సర్కిల్ పరిధిలోని పోలీసులు, సిఐఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో ప్రజలకు రక్షణగా ఉన్నామని తెలియచెప్పేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు రూరల్ సిఐ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, ఓటర్లు భయభ్రాంతులకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు తాము రక్షణగా ఉంటామని తెలిపారు. కంచికచర్ల మండలంలో ఎలాంటి అవాంఛనీయమైన ఘటన జరగకుండా ప్రజలకు భరోసా కల్పిస్తు కవాతు నిర్వహించారు. ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తినా కఠిన ఘటన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కంచికచర్ల ఎస్ఐ సుబ్రహ్మణ్యం, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం : జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసు బలగాలు కవాతు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా బుధవారం మండలంలోని ఊటుకూరు



గంపలగూడెం

గ్రామంలో (ఫ్లాగ్ మార్చ్) కవాతు తిరువూరు సిఐ ఎస్‌కె నభి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ కేంద్ర బలగాలతో నిర్వహించారు. సమస్యలు తలెత్తకుండా, తాము ఉన్నామంటూ, ప్రజలకు వివరించారు.

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కేంద్ర బలగాలతో కలిసి స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు చేపట్టారు. ఎన్‌టిఆర్ జిల్లా సిపి ఆదేశాల మేరకు, డిసిపి వెస్ట్ జోన్ పర్యవేక్షణలో ఎసిపి, వెస్ట్, ఎస్‌హెచ్‌ఒ, టు టౌన్ పిఎస్ ఆధ్వర్యంలో చిట్టినగర్ జంక్షన్ నుండి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కెటి.రోడ్, బ్రాహ్మణ సెయింట్, ఫిష్ మార్కెట్, పంజా సెంటర్ మీదుగా పంజా సెంటర్‌కు, వన్‌టౌన్, టౌన్‌పోలీస్ స్టేషన్, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ సిఐలు, సిపిఎఫ్, సిబ్బంది, పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు కవాతు నిర్వహించారు.



వన్‌టౌన్

సిఐఎస్ఎఫ్ బలగాల వసతుల పరిశీలన



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్, కమిషనర్ ఆఫ్ పోలీస్ కాంతి రాణా టాటా, డిసిపి అది రాజ్‌సింగ్ రానా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ కాలనీ ఆడిటోరియంలోని సిఐఎస్ఎఫ్ బలగాల వసతులను తనిఖీ చేశారు. అక్కడ వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. గుంటుపల్లి రమేష్ నగర్‌లో గల సిఎ కన్వెన్షన్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌ను తనిఖీలు చేసి తగు సూచనలు సలహాలిచ్చారు. పరిశీలనలో సిపి, డిసిపితో పాటు ఇబ్రహీంపట్నం సిఐ సత్యనారాయణ ఉన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విజయవాడ తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో బిహెచ్ భవాని శంకర్ బుధవారం మైలవరం నియోజకవర్గం సంబంధించి సజావుగా ఎన్నికలు నిర్వహిం చేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిం చారు. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఎన్‌ఎస్‌ఎం స్కూల్, రిసెప్షన్ సెంటర్ నిమ్రా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీల్లోని ఏర్పాట్లు పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గద ర్శకాలు అనుగుణంగా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఎన్నికలను విజయ వంతంగా నిర్వ హించడంలో నిబద్ధతతో భాగస్వాములు కావాలని ఆర్‌డిఒ సమన్వయ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. విజ యవాడ నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ ఎ.మహేష్ కె.వి.సత్యవతి ఏసీపీలు భాస్కరరావు రత్నరాజు పాల్గొన్నారు.

సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఎండ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఒంటిపూట బడులు పెడుతుందని, విద్యార్థులు ఒంటి పూట బడుల ద్వారా లభించే సమయాన్ని, వచ్చే వేసవి సెలవుల్లో ఇంగ్లీష్, కంప్యూటర్ వంటి కోర్సులు నేర్చుకోవాలని, ఈ సెలవులను సద్విని యోగం చేసుకోవాలని ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ తెలిపారు. మండలంలోని గానుగపాడు గ్రామంలో అయన మంగళవారం విస్తృతంగా పర్యటించి పలువురు విద్యార్థుల తల్లి దండ్రులను కలుసుకొని మాట్లాడారు. సెలవుల్లో పిల్లలకు సాంకేతకపరమైన అంశాలపై ఆసక్తి కల్పించాలని కోరారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో నాణ్యమైన విద్యను అందిస్తు న్నామని, పాఠశాల బలోపేతానికి తల్లిదండ్రుల సహకారం అవసరమని అన్నారు.

24న కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఈ నెల 24న వాసవీ కపుల్స్ క్లబ్, శ్రీరాం అమ్మాని నంబూరి వెంకట జనార్ధన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో అదే కళాశాలలో నిర్వహిస్తున్న మెగా కంటి వైద్య శిబిరం కరపత్రాలను మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి కపుల్స్ క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సోమేశ్వరరావు, వాసవి కపుల్స్ క్లబ్ ప్రెసిడెంట్ వాసా నాగమణి, కార్యదర్శి దారా సూర్యకళ్లరాజా, కోశాధికారి కె శోభారాణి, కొండ, కొత్త కృష్ణారావు, ఆర్యవైశ్య జిల్లా బిల్డింగ్ కమిటీ చైర్మన్ పేరూరి నరసింహారావు, వాసవి క్లబ్ జెడ్ సి ముద్దుల ఉమామహేశ్వరరావు, ఆనందవనం క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ చంద్రశేఖర్, వరగాని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం'

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలం ఆర్లపాడు గ్రామంలో తాము సిద్ధం-మా బూత్ సిద్ధం కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. స్థానిక వైసిపి నాయకులు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ ఫండ్ విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిటిపిఎస్ నూతన చీఫ్ ఇంజనీర్ నాగరాజును జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, కొండపల్లి మున్సిపాలిటీ వైసిపి చైర్మన్ అభ్యర్థి గుంజ శ్రీనివాసు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్‌టిటిపిఎస్ బూడిద కాలుష్యం వల్ల పరిసర ప్రాంత ప్రజలు పడుతున్న అవస్థలను సిఇ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న సిఎస్ఆర్ ఫండ్ విడుదల చేసి కాలుష్య ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. చిమ్నీల నుంచి నేరుగా బూడిద బయటకు వచ్చి గ్రామాలపై పడుతుందని, నియంత్రించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చిమ్నీలకు మర మ్మతులు చేయించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, కొంత సమయం పడుతుందని సిఇ స్పష్టం చేశారు.

గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో గల 18వ వార్డు అంగన్వాడీ కేంద్రం నుండి కొలా వారి ప్రభుత్వ వైద్యశాలలో పోషణ పక్వాడ్ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ బేస్డ్ ఇవెంట్ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ ఆళ్ళ హరీష్, డాక్టర్ అరుణా, ఎఎన్.ఎం షేక్ షాహీరా బేగం, అంగన్వాడీ కార్యకర్త దుడకా సీతామహాలక్ష్మి, ఆశా వర్కర్లు సిరాజున్నీసా, అంజమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలని ధర్నా



గన్నవరంలో...


ఉయ్యూరులో...

ప్రజాశక్తి-గన్నవరం : ధాన్యంబకాయి డబ్బులను వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రైతులకు ధాన్యం బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలో ఆర్బికే కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ధాన్యం బకాయి డబ్బులు చెల్లించకుండా ప్రభుత్వం రైతులు జీవితాలతో ఆటలాడుతుందని మండిపడ్డారు. చిక్కవరం ఆర్.బి.కె పరిధిలో 46 మంది రైతులు ధాన్యం తోలారని, లక్షల రూపాయలు బకాయిలు పడంతో అప్పులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతుండగా చేతను గుమ్మం దాటడం లేదని విమర్శించారు. ధాన్యం తోలిన ప్రతి రైతుకు డబ్బులు చెల్లించామని అబద్ధపు మాటలు చెబుతున్నారని ఇప్పటికైనా వాస్తవాలను పరిగణలోకి తీసుకొని రైతులకు డబ్బులు చెల్లించాలని విన్నవించారు. ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ ఆర్.బి.కేల ద్వారా మిల్లర్లకు ధాన్యం తోలి నెలలు గడుస్తున్న ఇంతవరకు డబ్బులు రాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. జిల్లాలో 300 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లుగా తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రైతులతో ఆందోళన ఉధతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు కైలే ఏసుదాసు, నల్లూరి ధర్మారావు, మల్లంపల్లి ఆంజనేయులు, మిరప నాగేశ్వరరావు, తాతబ్బాయి, అంతోని తదితరులు పాల్గొన్నారు. ఆర్బికే అధికారికి వినతి పత్రం సమర్పించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన రైతులకు ధరతోపాటు సకాలంలో ఆ కాయలు చెల్లించాలని అధికారులు సత్వరమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం నాయకులు అన్నే సుబ్బారావు డిమాండ్ చేశారు. బుధవారం బోళ్లపాడు గ్రామంలో కౌలు రైతులు చిన్న సన్న కారు రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.తుమ్మూరు రామిరెడ్డి సంజీవరెడ్డి దొంతి రెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


విరాళంఅందజేస్తున్న దాతలు

మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి ఆలయ మండపం నిర్మాణానికి అమెరికాకు చెందిన గొట్టుముక్కల భానుదేవ వర్మ, సుష్మ చౌదరి దంపతులు లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. పాతూరి వెంకట దుర్గారాణి చేతుల మీదుగా ఆలయ కమిటీకి చెక్కు బుధవారం అందజేశారు. అదేవిధంగా అమెరికాకు చెందిన జాస్తి శ్రీనివాస్ ప్రసాద్ దంపతులు రెండు లక్షల 50 వేల రూపాయలు విరాళంగా అందించారు. గన్నవరానికి చెందిన బాయన సాంబశివరావు,విజయ నాగలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. వారికి ఆలయ కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది.

భద్రంగా జర్నలిస్టుల హౌసింగ్ దరఖాస్తులు : డిఐపిఆర్ఓ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఫైల్, దరఖాస్తులు డిఐపిఆర్ఓ కార్యాలయంలో భద్రంగా ఉన్నాయని జిల్లా సమాచార పౌర సంబంధాధికారి ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'చెత్త బుట్టలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల ఫైలు మినిట్స్ పత్రాలు" అంటూ బుధవారం వార్త పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించి ఆయన వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 535, రెవిన్యూ (ల్యాండ్స్-1) శాఖ తేదీ 11-11-2023 జారీ చేసిందన్నారు. దీని అమలుకు జిల్లా కలెక్టర్ వారు జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేశారని, ఈ కమిటీ తొలి సమావేశం 17-2-2024 తేదీన కలెక్టరేట్లో నిర్వహించారన్నారు. ఈ సమావేశం మినిట్స్ జిల్లా కలెక్టర్ వారి ఆమోదం కూడా పొందాయన్నారు. జర్నలిస్టుల ఆన్లైన్ హౌసింగ్ దరఖాస్తులు సంబంధిత వెబ్సైట్ ఆన్లైన్ లో భద్రంగా ఉన్నాయని, జర్నలిస్టుల నుండి ఆన్లైన్ దరఖాస్తుల ప్రింట్ 2 ప్రతులు సేకరించి, ఒక ప్రతి సంబంధిత ఆర్డీవోలకు పంపగా, 2వ ప్రతి దరఖాస్తులు ఈ కార్యాలయంలో భద్రంగా ఉంచామన్నారు.



టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్:: భయపెట్టినా, కేసులు పెడతామని బెదిరించినా భయపడకుండా రాష్ట్రాభివద్ధికి టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు.బాపులపాడు మండలం ఎ.సీతారామపురం ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామాల్లోని స్థానిక టి.డి.పి నాయకులు బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నూజివీడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబులతో కలిసి అయిన పాల్గొన్నారు. ఎ.సీతారాంపురం గ్రామ సర్పంచ్ బోరపురెడ్డి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో 100 మంది యువకులు, మహిళలు టీడీపీలో బుధవారం చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి సాయికళ్యాణి, వేగిరెడ్డి పాపారావు, వేమలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



మాట్లాడుతున్న సేలం ప్రకాష్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ప్రతి జాబ్ కార్డు కలిగిన కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని, రోజువారి కూలీ రూ. 600 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సేలం ప్రకాష్ రావు అన్నారు. తోట్లవల్లూరులో బుధవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో జాబ్ కార్డు కలిగిన కుటుంబానికి సగటున 35 రోజులు మాత్రమే పని దినాలు లభిస్తున్నాయని, జాబు కార్డు కలిగిన 2000 కుటుంబాలకు అసలు పనే దొరకటం లేదని వివరించారు. ఉపాధి మహాత్మా గాంధీ జాతి గ్రామీణ ఉపాధి పథకం వ్యవసాయ కూలీలకు పేదలకు ఎంతో ఆసరాగా ఉండే ఉపాధి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని, దీనిని ఇప్పుడు ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నీరు కార్చే పనిలో ఉందన్నారు. దీనికి మూడు లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సి ఉండగా కేవలం 80 వేల కోట్లు మాత్రమే ప్రవేశపెట్టి పథకాన్ని నీరుటగార్చే పని చేస్తున్నారని ఆయన అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జుజ్జువరపు యోసేపు,వల్లూరు సహదేవుడు, వల్లభాపూర్ ఏసు పాదం, ఎం. ధనలక్ష్మి, కటారి మంగమ్మ, ఎస్.లక్ష్మి,డేవిడ్ రాజు పాల్గొన్నారు.




శ్రీదేవికి కాంస్య పతకం

ప్రజాశక్తి-గన్నవరం : న్యూఢిల్లీ లో జరుగుతున్న అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్ లో కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఎన్ . శ్రీదేవి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా శ్రీదేవికి గ్రామానికి చెందిన మూల్పూరి మాధవన్, ఎం వి ఎల్ ప్రసాద్, సర్పంచి మౌనిక హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

- రాత్రిళ్లు గస్తీ పెంచాలని ప్రజల వినతి



ప్రజాశక్తి-పెడన : పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాల సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతుంది. వీటిని నియంత్రిం చాల్సిన అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రజలకు వీటిపై అవగాహన కల్పించి, గస్తీలు నిర్వహిం చాల్సిన ఆ శాఖ అలసత్వం కారణంగానే దొంగలు పెట్రేగిపోతున్నారని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీస్ అధికారుల రికార్డుల ప్రకారం మండల పరిధిలోని నందమూరి గ్రామంలో మురాల బాజీ, వికాస్ లకు చెందిన రెండు మొబైల్ షాప్‌లో సెల్‌ఫోన్లు, కెమెరాలు దొంగతనం గత 15 రోజుల క్రితం జరిగింది. ఆ మరుసటి రోజున దీనిని గమనించిన యజమానులు పోలీస్ స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడ చేరుకుని జరిగిన దొంగతనాన్ని పరిశీలించారు. కానీ నేటికీ వాటిని రికవరీ చేయకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతుంది. ఇదిలా ఉండగా తాజాగా మంగళవారం రాత్రి పట్టణంలోని నాలుగో వార్డ్ కి చెందిన అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుడి చెందిన నివాసంలో గత ఏడాదిన్నరగా రజియా సుల్తానా అనే మహిళ అద్దెకు ఉంటుంది. గ్రౌండ్ ఫ్లోర్ లో ఆ రాజకీయ నాయకుడు నివాసం ఉండగా మొదటి అంతస్తులు బాధితురాలు ఏడాదిన్నరగా అద్దెకు ఉంటున్న ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆమె చెప్పిన వివరాలు ప్రకారం పరిశీలించారు. 25 కాసుల బంగారు ఆభరణాలు అలాగే పదివేల రూపాయలు నగదును దుండగులు అపహరించకపోయినట్లు ఆమె పోలీసులకు తెలిపింది. దీనిపై ఉన్నతాధికారులు కూడా సంఘటన స్థలానికి క్లుస్ టీం ను రప్పించారు. అయితే ఈ దొంగతనం జరిగి 24 గంటలు గడిచిన ఎలాంటి ఆచూకీ లభించకపోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఇటీవల బదిలీపై వచ్చిన పెడన రూరల్ సీఐ ఎస్సై లకు వరుస దొంగతనాలు సవాలుగా మారాయి. మరోవైపు ఎన్నికల కోడ్ అమల లో ఉండడం బందోబస్తు మరియు ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన తరుణంలో ఈ వరస దొంగతనాలు పోలీసులను కలవరపెడుతున్నాయి.

గస్తీ నిర్వహించకపోవడమే కారణమా..

రాత్రిపూటలు పోలీసులు గస్తీ నిర్వహించడంలో అలసత్వం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్నంలోని ప్రముఖ కూడళ్ళ తో పాటు శివారు ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే కొంతమేరకు వీటిని నివారించవచ్చని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


రెండు రోజులు క్రితం నందమూరి లో జరిగిన రెండు షాపుల్లోనూ దొంగతనాలు సీసీ కెమెరా ద్వారా పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ డి.ఎస్.పి శ్రీకాంత్ ఆదేశాల మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లో బుధవారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఓటర్లు తమ ఓటు హక్కు ధైర్యంగా వినియోగించుకోవడానికి గాను సెంట్రల్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ సీఐ కె యేసు బాబు, గుడ్లవల్లేరు ఎస్సై జి సత్యనారాయణ , సిబ్బంది పాల్గొన్నారు .

నేటి నుంచి ప్రతిష్ట మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం గ్రామంలో పురాతన చరిత్ర గల శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో నూతన యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ఈనెల 21 నుండి 25 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లా శాంత, చల్లా రాజేంద్రప్రసాద్, కానూరి వారి కుటుంబ సభ్యుల సంకల్పంతో మరియు ధర్మకర్తల మండలి సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం

విజయవాడ : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం బందరు లాకుల వద్ద ఉన్న సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ అభినవ్, పిల్లల వైద్య నిపుణులు చలసాని అనూష, సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ వద్దులు ఎదుర్కొనే పలు న్యాయ సమస్యలకు పరిష్కార మార్గాలను సూచించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేమూరు బాబురావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కెవివి.పరమేశ్వరరావు, సంఘం సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతి, సామాజిక కార్యకర్త అరుణకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అభినవ్

దండమూడి సేవలు అభినందనీయం



అన్న క్యాంటిన్ వంద రోజులు సందర్భంగా పాల్గొని ప్రారంభిస్తున్న బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్

ప్రజాశక్తి-ఉయ్యూరు : పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న నందమూరి తారకరామారావు ఆశయాన్ని అమలు చేస్తూ అన్న క్యాంటిన్ ప్రారంభించి వంద రోజులు నిరాటంకంగా కొనసాగిస్తూ పేదవారి ఆకలితీర్చుతున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు అన్నారు. దండమూడి చౌదరి, స్నేహితుల సహకారంతో ఉయ్యూరులో అన్న క్యాంటిన్ ప్రారంభించి వందరోజులు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులతో కలసి కేక్కట్చేసి స్వీట్లు పంచారు. ఈసందర్భంగా క్యాంటిన్లో అన్న వడ్డించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కూడు, గూడు, గుడ్డ కల్పించాలని నందమూరి తారక రామారావు అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. స్నేహితుల సహకారం, డీజేఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేదల ఉపాధికి తోపుడు బండ్లు, బడ్డీలు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తూ, అన్న క్యాంటి న్ ద్వారా రూ. 5లకే పొట్టినిండా అన్నం పెడుతున్నామని దండమూడి చౌదరి పేర్కొన్నారు. పార్టీ నాయకులు జంపాన గుర్నాధరావు, పలియాల శ్రీనివాసరావు, పరిమి భాస్కర్, అప్పలనాయుడు, యుగబాబు, సుబ్బారావు, అంజిబాబు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



ప్రజాశక్తి ఉయ్యూరు : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు చెకోపోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఉయ్యూరు పట్టణ సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్కుమార్, సిబ్బంది స్టాటిక్ సర్వేలియాన్స్ టీమ్-3 ఇన్ చార్జ్ ఎం వెంకటేశ్వరరావుతో కలసి కాటూరు రోడ్డులో వాహనాలు తనిఖీచేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక వర్లబజార్లోని పాత ఇండియన్ గ్యాస్ కాంపెనీ సమీపంలోని తుంపూడి నాగ వెంకట సాంబశివరావు స్వగృహంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వృద్ధుల సంక్షేమ సంఘం 5వ సర్వసభ్య సమావేశాన్ని సంఘ ఉపాధ్యక్షుడు బొగ్గరపు తిరపతయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సీతారామయ్య, అధ్యక్షుడు బొగ్గరపు తిరపతయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నం గంగాధరావు, ఉపాధ్యక్షులుగా దండమూడి సీతారామస్వామి, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ హన్ను, కోశాధికారిగా బొమ్మదేవర సత్యనారాయణ, అర్గనైజింగ్ కార్యదర్శిగా పీత నాగేశ్వరరావు, సభ్యులుగా తుంపూడి నాగవెంకటసాంభశివరావు, కోనా వజ్రాలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - కాచవరం

ఇబ్రహీంపట్నం మండలం

టెండరు ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కాచవరం గ్రామపంచాయతీకి ప్రజాశక్తి దినపత్రిక ద్వారా ఈ దిగువ ఉదహరించిన కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 01-4-2024 నుండి ది.31-3-2025 వరకు గ్రామపంచాయతీ పనులు చేయుటకు పంచాయతీ కార్యదర్శి గారిచేగాని వారి అనుమతి పొందిన వారిచే ది. 25-3-2024వ తేదీన ఉదయం 11-00 గం.లకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు మధ్యాహ్నం 1-00 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు డిపాజిట్ గ్రామపంచాయతీలో జమకట్టి రశీదును దరఖాస్తునకు జమచేయవలెను. ఇతర వివరములు కార్యాలయం పనివేళలందు అడిగి తెలుసుకొన వచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరము	టెండరు కాలపరిమితి	ధరావత్తు
1.	1. ట్యాంక్ ఆపరేటర్ మరియు మోటారు రిపేరు పనులకు గాను 2 వ్యక్తుల సేవలు 2. గ్రామపంచాయతీ పారిశుధ్యపు పనులకు 2 వ్యక్తుల సేవలు 3. వీధి దీపముల నిర్వహణకు 1 వ్యక్తి సేవలు	1-4-2024 నుండి 31-3-2025 వరకు ఒక సంవత్సర కాలము	రూ.2000/- రూ.2000/- రూ.1000/-
		మొత్తము	రూ.5000/-

నోట్ : 1) గతంలో ఈ గ్రామపంచాయతీలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపు జరుపబడును.

సం॥ శ్రీ దండుబోయిన రాజేంద్రప్రసాద్,
సర్పంచ్,
కాచవరం గ్రామపంచాయతీ

సం॥ శ్రీ పోసాని అనిల్‌కుమార్
పంచాయతీ కార్యదర్శి
కాచవరం గ్రామపంచాయతీ

రామరాజుపాలెంలో 'గడపగడపకూ శంఖారావం'

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం రామరాజుపాలెం గ్రామంలో బుధవారం శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను పెడన నియోజకవర్గం తెలుగుదేశం జనసేన బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష ప్రచారం చేశారు. అనంతరం మాజీ శాసనసభ్యులు కాగిత వెంకటరావు 72వ జయంతి సందర్భంగా రామరాజుపాలెం గ్రామంలో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేక్ ను కాగిత శిరీష కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, గోపి నాగబాబు, కాసగాని శ్రీనివాస రావు, గంజాల వెంకటేశ్వర రావు,కష్ణ మోహన్,ఎన్ ఏ బేగ్,శయన సోమయ్య,పోతుల రాము, బాసం శెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లైన్స్ సేవా భవనం నందు లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మండ లక్ష్మీ నాగేశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో120 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు బి నాగేశ్వరరావు, కార్యదర్శి చలసాని శ్రీధర్, ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వై పి సి ప్రసాద్ , ఆర్ సి లయన్ పిఎన్వి విజయ్ బాబు , లైన్స్ క్లబ్ ప్రతినిధులు చాపరాల రాజా, దేవిశెట్టి రామకష్ణ జంగం మోహన్ రావు , దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :చదువే అన్నింటికి మూలమని, విద్యతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో గౌరవం లభిస్తుందని సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ కె.రాములునాయక్ అమ్మ అనాధ ఆశ్రమం విద్యార్థులకు సూచించారు. బాపులపాడు మండలం వేలేరు గ్రామంలోని నేతాజీ సుబాస్చంద్రబోస్ అవాసియ విద్యాలయ (అమ్మ అనాధ ఆశ్రమం) హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యాలయ తరగతి గదులను, విద్యా బోధన, హాస్టల్ తీరుతెన్నులను జిల్లా సెక్టోరియల్ అధికారులు రాంబాబు, నగేష్, రామకష్ణ, ఎంఈఓ రాంబా లాసింగ్, సురేష్కుమార్ లతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి లక్ష్యాల గురించి ఆరా తీశారు. తదనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవడంతో పాటు క్రమశిక్షణతో కూడిన అభ్యాసంతో సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు రాంబాబు, నగేష్, రామకష్ణ, సురేష్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విన్నకోటలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని గుడివాడ టిడిపి పార్టీ ఇన్చార్జి వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. మండలంలోని విన్నకోట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము బుధవారం ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వర్ రావు , గుడ్లవల్లేరు మండల టిడిపి అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి , క్లస్టర్ ఇంచార్జ్ అడుసుమిల్లి రామ్మోహన్ రావు ,కొడాలి రామరాజు,జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ,పేర్ని జగన్ , పాలంకి సారథి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - గుడివాడ : హమ్ ఏక్ - హమారి ఆవాజ్ ఏక్ - పేరుతో నిర్వహించిన మంగళవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందు సమావేశంలో పాల్గొన్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టిడిపి నియోజవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ యువత, మైనార్టీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - చిలుకూరు

ఇబ్రహీంపట్నం మండలం

టెండరు ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, చిలుకూరు గ్రామపంచాయతీకి ప్రజాశక్తి దినపత్రిక ద్వారా ఈ దిగువ ఉదహరించిన కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 01-4-2024 నుండి ది.31-3-2025 వరకు గ్రామపంచాయతీ పనులు చేయుటకు పంచాయతీ కార్యదర్శి గారిచేగాని వారి అనుమతి పొందిన వారిచే ది. 25-3-2024వ తేదీన ఉదయం 11-00 గం.లకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు మధ్యాహ్నం 1-30 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు డిపాజిట్ గ్రామపంచాయతీలో జమకట్టి రశీదును దరఖాస్తునకు జమచేయవలెను. ఇతర వివరములు కార్యాలయం పనివేళలందు అడిగి తెలుసుకొన వచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పని వివరము	టెండరు కాలపరిమితి	ధరావత్తు
1.	1. ట్యాంక్ ఆపరేటర్ మరియు మోటారు రిపేరు పనులకు గాను 1 వ్యక్తుల సేవలు 2. గ్రామపంచాయతీ పారిశుధ్యపు పనులకు 1 వ్యక్తుల సేవలు 3. వీధి దీపముల నిర్వహణకు 1 వ్యక్తి సేవలు	1-4-2024 నుండి 31-3-2025 వరకు ఒక సంవత్సర కాలము	రూ.1000/- రూ.1000/- రూ.1000/-
		మొత్తము	రూ.3000/-

నోట్ : 1) గతంలో ఈ గ్రామపంచాయతీలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపు జరుపబడును.

సం॥ గొంది సురేష్
సర్పంచ్,
చిలుకూరు గ్రామపంచాయతీ

సం॥ శ్రీ పోసాని అనిల్‌కుమార్
పంచాయతీ కార్యదర్శి
చిలుకూరు గ్రామపంచాయతీ

పంటల రకాలపై అవగాహన



రంగవల్లుల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : గ్రామీణ వ్యవసాయ కషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల అగ్రికల్చర్ కాలేజ్ విద్యార్థినులు ఘంటసాల చరిత్ర, పంటల రకాలు, తదితర అంశాలపై రైతులకు, గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఘంటసాల ప్రధాన రహదారులు, వనరులు, పంటలు, సమస్యలు, గ్రామ చరిత్ర టైమ్ లైన్, మొదలగు ప్రదేశాలను రంగవల్లులతో తీర్చిదిద్ది ఏయే పంటలు అధికంగా పండుతాయి, రాబడి, రైతులు, సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు, పాఠశాలలు, తదితర అంశాలను తెలియపర్చేల బొమ్మలు వేసి రైతులకు, గ్రామస్తులకు వివరించారు. రైతులు పి.యెహోను, వి.కోటేశ్వరరావు, బి. రాజేంద్ర, వీఏఏ రేవతి, అగ్రికల్చర్ విద్యార్థినులు కె.ప్రిస్కిల్ల, కె.షైనీ, ఆర్. శ్రావణి, ఏ.సుధర్శిణి, కె.స్వాతిలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - మూలపాడు

ఇబ్రహీంపట్నం మండలం

టెండరు ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడు గ్రామపంచాయతీకి ప్రజాశక్తి దినపత్రిక ద్వారా ఈ దిగువ ఉదహరించిన కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 01-4-2024 నుండి ది.31-3-2025 వరకు గ్రామపంచాయతీ పనులు చేయుటకు పంచాయతీ కార్యదర్శి గారిచేగాని వారి అనుమతి పొందిన వారిచే ది. 25-3-2024వ తేదీన ఉదయం 11-00 గం.లకు సీల్డు టెండర్లు తీసుకొనబడును. అదేరోజు మధ్యాహ్నం 1-30 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు డిపాజిట్ గ్రామపంచాయతీలో జమకట్టి రశీదును దరఖాస్తునకు జమచేయవలెను. ఇతర వివరములు కార్యాలయం పనివేళలందు అడిగి తెలుసుకొన వచ్చును.

వ.నెం.	పని వివరము	టెండరు కాలపరిమితి	ధరావత్తు
1.	1. గ్రామపంచాయతీ పారివుధ్య నిర్వహణ 4 మంది వ్యక్తుల సేవలు 2. మంచినీటి నిర్వహణ 1 వ్యక్తి సేవలు 3. వీధి దీపముల నిర్వహణకు 1 వ్యక్తి సేవలు	1-4-2024 నుండి 31-3-2025 వరకు ఒక సంవత్సర కాలము	రూ.6000/-

పనివివరములు: గమనిక : 1) గతంలో ఈ గ్రామపంచాయతీలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపు జరుపబడును.

సం॥ చింతల భూలక్ష్మి
సర్పంచ్
మూలపాడు గ్రామపంచాయతీ

సం॥ సం॥ శ్రీ పోసాని అనిల్‌కుమార్
పంచాయతీ కార్యదర్శి
మూలపాడు గ్రామపంచాయతీ

బకాయిలు చెల్లించకుంటే 'ఆరోగ్యశ్రీ' నిలిపివేత

ఆసుపత్రుల అసోసియేషన్ హెచ్చరిక

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ప్రయివేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్ అసోసియేషన్ (ఆశా) ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా ఎంవోయు ప్రకారం చెల్లింపులు క్లియర్ కాకపోతే, హాస్పటల్ వారు పథకం కింద కొత్త రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని భావిస్తున్నామని ఆయా హాస్పటల్ ప్రతినిధులు తెలిపారు. గతంలో తమ అసోసియేషన్‌తో జరిగిన సమావేశాల్లో మార్చి, 20వ తేదీలోగా కొన్ని బకాయిలు చెల్లిస్తామని ఆరోగ్యశ్రీ ట్రస్టు, ప్రిన్సిపల్ సెక్రటరీ వాగ్ధానాలు చేశారన్నారు. కానీ బకాయిలు క్లియర్ కాలేదని తెలిపారు. ఈపథకం ద్వారా సేవలను అందిస్తున్నా చాలా ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు ఆరు నుండి ఏడు నెలల క ంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. హాస్పటల్స్‌లో పనిచేసే సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం కారణంగా హాస్పటల్ సిబ్బంది, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. విక్రేతలు , మందులు, వినియోగ వస్తువుల కొనుగోలు కోసం హాస్పటల్స్‌కు క్రెడిట్‌ను అందించడం నిలిపివేశాయన్నారు. హాస్పటల్‌కు చెందిన ఆస్తిపన్ను, ప్రకటనల పన్ను, వృత్తి పన్ను, విద్యుత్తు, నీటి బిల్లులు మొదలైన అన్ని చట్టబద్ధమైన చెల్లింపులు ఆలస్యం కాకుండా వెంటనే బకాయిలు క్లియర్ చేయకపోతే సేవలను డిస్‌కనెక్ట్ చేస్తామని లేదా కఠినమైన జరిమానాలు విధిస్తామని బెదిరిస్తున్నాయన్నారు. కాబట్టి తమ సమస్యలను గుర్తించి వెంటనే ఆరోగ్యశ్రీ ద్వారా రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

15వ డివిజన్‌లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక 15వ డివిజన్‌లోని రామలింగేశ్వరనగర్ ఆర్చ్, స్క్రూ బ్రిడ్జ్ నుండి పడవులరేవు సెంటర్ వరకు విజయవాడ యం.పి కేశినేని శ్రీనివాస్ (నాని), నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ గడప గడపకి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నాలుగున్నర ఏళ్ల జగనన్న ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివద్ధి కార్యక్రమాల గురించి వారు ఓటర్లకు వివరించారు. ఓటు వేసి గెలిపించాలని ఎంపి కేశినేని, ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లందుర్గ, ఇతర వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అద్భుత పనితీరు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ యొక్క సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిర్వహణలో అద్భుతపనితీరు కనపరచి అత్యధిక మైలు రాయిని సాధించిందని సంస్థ అడ్వైజరీ కమిటీ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధిక మైలురాయిని సాధించిన కంపెనీలలో స్వామి వివేకానంద యూత్ మవ్‌మెంట్, ట్రాన్స్‌ఫార్మ్ రూరల్ ఇండియా, ఏకలవ్య ఫౌండేషన్, ఎస్టీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్ వంటి సంస్థలు ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆయా కంపెనీల సంస్థల సభ్యులను ఎన్ఎస్ఇ సంస్థ ప్రతినిధులు అభినందించారని తెలిపారు.

క్రోమా ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎలక్ట్రానిక్స్ విక్రయాలలో అగ్రగామిగా ఉన్న క్రోమా వేసవి సందర్భంగా ప్రత్యేక క్యాంపెయిన్, ఆఫర్లను ప్రకటించినట్లు క్రోమా రీజనల్ ఇన్‌ఛార్జి కె.రాజశేఖర్ తెలిపారు. ఎంజి రోడ్డులోని క్రోమా స్టోర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. సమ్మర్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించామని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు 1.5 టన్ స్ప్లిట్ ఏసిలు కేవలం రూ.1500 నుండి స్టోర్‌లు, క్రోమా షోరూమ్ నందు పొందవచ్చని అన్నారు. అలాగే ఆకర్షణీయమైన ఎక్సేంజ్, అప్‌గ్రేడ్ ఎంపికలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, 24 నెలల వరకు ఫ్లెక్సిబుల్ ఈఎంఐ ప్లాన్‌తో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా ప్రయోజనాలు కూడా పొందవచ్చని తెలిపారు.

ప్రజల వెన్నంటి ఉండే నేతలను ఎన్నుకోండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- 58వ డివిజన్‌లో సిపిఎం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్: ఐదు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చి పలకరించే నేతలు వద్దని, నిత్యం ప్రజల వెంటే ఉంటూ ప్రజా సమస్యలపై నేతలను అసెంబ్లీకి పంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కోరారు. సిపిఎం 58వ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలన్నారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న మల్లాది విష్ణు ప్రజా సమస్యలు పట్టించుకోలేదని, టిడిపి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఐదేళ్లు గెలిచి ప్రజలకు ఒక్కసారైనా మొహం చూపించలేదని విమర్శించారు. గెలిచిన ఎమ్మెల్యేలు సక్రమంగా పని చేసి ఉంటే రాజీవ్ నగర్ సుందరయ్య నగర్ మంచినీటి సమస్య వచ్చి ఉండేది కాదన్నారు. సిపిఎం నాయకులు మంచినీటి సమస్యపై పోరాడి అదనంగా బోరు వేయించారని గుర్తు చేశారు. మంచినీరు రాని సమయంలో ఈ ఎమ్మెల్యే ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పట్టనప్పుడు వారు ఎమ్మెల్యేలుగా ఎందుకు ఉన్నారో చెప్పాలన్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లివ్వకుండా ఉత్తుత్తి పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. డిస్నీల్యాండ్‌లో 57 ఎకరాల స్థలం ఉంటే దానిని కబేళాకు ఇస్తామనడం దారుణమన్నారు ప్రజలకు నివశించడానికి అనుకూలంగా ఉన్న డిస్నీల్యాండ్‌ను కబేళాగా చేయడం దారుణమన్నారు. చెత్త కంపెనీ పక్కన జి ప్లస్ త్రీ ప్లాట్లు వెయ్యి ఖాళీగా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఎందుకు పంచడంలేదని ప్రశ్నించారు. కండ్రిక, రాజీవ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాలలో ఆనాడు 15 రూపాయలకే పట్టాలు అందజేసిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. జక్కంపూడిలో ఇళ్లు కట్టిస్తామని చెప్పి గత టిడిపి ప్రభుత్వం 25 వేల నుంచి లక్ష రూపాయలు వరకు వసూలు చేశారని, ఆ డబ్బులు తినేసి వాళ్లు కనబడకుండా పోయారని విమర్శించారు. టిడిపి, వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే, సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, అధ్యక్షులు కె.దుర్గారావు, రాంబాబు, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


58వ డివిజన్ సిపిఎం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

58వ డివిజన్‌లో పాదయాత్ర

సింగ్‌నగర్ కృష్ణ హోటల్ సెంటర్ శివాలయం 137 బ్లాక్ నుండి 'మార్పు కోసం సిపిఎం పాదయాత్ర' బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా ప్రజలు అనేక సమస్యలు బాబూరావు దృష్టికి తీసుకొచ్చారు. దోమలు విపరీతంగా ఉన్నాయని, డ్రైనేజీలు శుభ్రం చేయడంలేదని, అనారోగ్యాల పాలవుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం నాయకులు పివిఎస్ఎన్ మూర్తి, నాగేశ్వరరావు, చంద్రమణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో 'కలియుగ పట్నం' సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: క్రైమ్, థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్‌తో కలియుగ పట్నంలో చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఆ చిత్ర కథానాయకులు విశ్వ కార్తికేయ, నరేన్ రామ్ తెలిపారు. కలియుగం పట్టణంలో చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మురళి ఫార్చ్యూన్ రోడ్ లోని ఒక హోటల్లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా విశ్వ కార్తికేయ మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో తమ చిత్రం ప్రమోషన్ ప్రారంభించామని కళాశాల విద్యార్థులతో తమ చిత్ర విశేషాలు ముచ్చట్టించిన సమయంలో వారి నుంచి వచ్చిన స్పందన ఎంతో సంతోషంగా ఉందన్నారు .క్రైమ్, థ్రిల్లర్, లవ్ ఎలిమెంట్లతో చిత్రం ఉంటుందన్నారు. బాల నటుడిగా ఎన్నో చిత్రాల్లో నటించాననీ చెప్పారు. ఎన్నో క్రైమ్ సినిమాలు వచ్చి ఉంటాయి కానీ వీటన్నిటికీ విభిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు. మార్చి 29న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుందనీ, ప్రేక్షకులందరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. ఇప్పటికే విడుదలన ట్రైలర్‌కు విశేష స్పందన లభించిందన్నారు. కుటుంబ సమేతంగా తమ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించవచ్చు అని తెలిపారు. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయని వివరించారు. నరేన్ రామ్ మాట్లాడుతూ సీనియర్ నటుడు గుమ్మడి మనవుడిని అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానన్నారు. తమిళ భాషల్లో ఇప్పటికే రెండు చిత్రాల్లో నటించాననీ చెప్పారు. తెలుగులో ఇది తొలిచిత్రం అని తన మాతృభాష అయినా తెలుగు ఇండస్ట్రీలో నటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇందులో క్రైమ్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేసేలా ఉంటాయన్నారు. అనంతరం దర్శకుడు రమణ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రం క్రైమ్, థ్రిల్లర్, లవ్, మదర్ సెంటిమెంట్ తో ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని చాలెంజింగా తీశాననీ, ఈ చిత్రంలో ఉన్న క్రైమ్ సన్నివేశాలు యువత ఎవరు ఇన్స్పిరేషనల్‌గా తీసుకోవద్దన్నారు. కేవలం చిత్రం కోసం మాత్రమే కల్పిత పాత్రలు, వాటిని ఎవరు ఫాలో అని మనవి చేసుకుంటున్నను అన్నారు. ప్రేక్షకులు అందరూ థియేటర్ల వద్దకు వచ్చి చిత్రాన్ని ఆదరించాలని కోరారు. అనంతరం హీరోయిన్ ఆరుషి మాట్లాడుతూ ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులను కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయం చేసి ఆదరించాలని ఆమె కోరారు విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


కలియుగ పట్నం చిత్ర యూనిట్

పదేళ్లలో రాష్ట్రాభివృద్ధి శూన్యం : శివాజీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్

గత పదేళ్లుగా టిడిపి, వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ అన్నారు. మచిలీపట్నంలోని పట్టాభి భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని నిర్మాణాన్ని చేపట్టలేక పోయారని విమర్శించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ మతీన్, జిల్లా అధికార ప్రతినిధి దీపిక గునుకుల, జిల్లా ప్రధాన కార్యదర్శి కొడమంచలి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లిటిల్ బ్రైన్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సిద్ధార్థ నగర్ లోని లిటిల్ బ్రైన్స్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు భూడవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పిల్లలు ఆట పాటలతో అలరించారు. నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, పాఠశాల డైరెక్టర్ ప్రముఖ విద్యావేత్త ముక్తేవి ఫణిప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లలకు ఒత్తిడి లేకుండా ఆట పాటలతో చదువు నేర్పించుకోవాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధ ప్రవీణా ముక్తేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని అని తెలిపారు.

సోనీ డిజిటల్ కెమెరా ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సోనీ నుండి డిజిటల్ కెమేరాలు, సినీ ఆల్టా శ్రేణిలో సరికొత్త బురానో కెమేరాను ఆవిష్కరించినట్లు ఎం.జి.రోడ్డు సోనీ సెంటర్ ప్రతినిధి మనీష్ కుమార్ తెలిపారు. సోనీ డిజిటల్ షోరూమ్ నందు నూతన ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడిజిటల్ కెమేరాలలో సరికొత్త టెక్నాలజీతో సెన్సార్‌ను కలిగిఉంటుందన్నారు. ప్రత్యేకంగా సింగిల్ కెమేరా ఆపరేటర్లు, చిన్న సిబ్బంది కోసం రూపొందించారన్నారు. ఈకెమేరా అసాధారణమైన చిత్ర నాణ్యతను అధిక మొబిలిటీతో మిళితం చేస్తుందన్నారు. మొట్టమొదటి డిజిటల్ కెమేరాగా ప్రసిద్ధిచెందిందన్నారు. కాంపాక్ట్ హౌసింగ్‌తో పాటు ఇమేజ్ స్టెబిలైజేషన్ మెకానిజంతో పాటు ఎలక్ట్రానిక్ వేరియబుల్ ఫిల్టర్ దీని ప్రత్యేకత అన్నారు. అన్ని సోనీ ఎక్స్‌క్లూజివ్ స్టోర్లతో పాటు అన్ని ఎలక్ట్రానిక్ షోరూమ్‌లలో లభ్యమవుతాయని తెలిపారు.